క్లుప్తంగా

వైభవం.. వేణుగోపాల స్వామి కల్యాణం


స్వామి కల్యాణంలో భక్తజనం

మంచాల: మండల పరిధి ఆరుట్ల గ్రామంలో మంగళవారం శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వేణు గోపాల స్వామి సహిత సత్యభామ, రుక్మిణిల కల్యాణ క్రతువు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో నాయకులు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, చీరాల రమేష్, కావలి శ్రీనివాస్, సికిందర్‌రెడ్డి, రాజు ముదిరాజ్, జంగయ్య గౌడ్, మాసయ్య, గుడిమల్ల చంద్రయ్య, కుమార్, సురేష్, రాజు, ఐలయ్య, బాష, భాస్కర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి రథోత్సవం


ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు

యాచారం: కొత్తపల్లి– తక్కళ్లపల్లి గ్రామాల మధ్య కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కొత్తపల్లి గుట్టపై దేవాలయంలో శ్రీ గోదాదేవి, పద్మావతి, వేంకటేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. రథోత్సవానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోటాపోటీగా రథం లాగారు. ముందు జాగ్రత్తగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీఈఈయూ ఆవిర్భావ సంబురాలు


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: టీఈఈయూ 1104 యూనియన్ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం యూనియన్ నాయకులు పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సంబురాలు చేసుకున్నారు. జెండాను ఆవిష్కరించి, బాణసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ డివిజన్ ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి లక్ష్మణ్, ఆమనగల్లు సబ్ డివిజన్ నాయకులు అశోక్, శ్రీనివాస్, బానుప్రకాశ్, ప్రభుదాస్, దేవిలాల్, వెంకటయ్య, మోజం, వెంకటేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

16న మదర్సా ఆధ్వర్యంలో జల్సా


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లింలు

ఆమనగల్లు: పట్టణంలోని ఓ గార్డెన్‌లో ఈ నెల 16న మదర్సా దారుల్ ఉలూం అన్వరే ముస్తఫా ఆధ్వర్యంలో 11వ జల్సా నిర్వహిస్తున్నట్లు మదర్సా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఖలీల్ తెలిపారు. బుధవారం మైనార్టీ నాయకులతో కలిసి జల్సా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ.. జల్సా కార్యక్రమంలో పలువురు మత పెద్దలు హాజరుకానున్నారని తెలిపారు. కావున ముస్లింలు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మదర్సా ప్రిన్సిపల్ మౌలానా అబ్దుల్ కరీం, నాయకులు లతీఫ్, మహబూబ్, బాబా, షరీఫ్, జహంగీర్, షఫియుల్లా అలీం, అబ్బు, హఫీజ్, అహ్మద్, సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 'భరోసా' ఇవ్వండి

యాచారం: రైతు భరోసా నిధులను ఆపవద్దని, వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎకరా లోపు రైతులకు కూడా సక్రమంగా నిధులు జమ కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం వరి నాట్లు, ఇతర వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో.. భరోసా ఇస్తే.. అన్నదాతలకు మేలు జరుగుతుందన్నారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో వేగం పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి
- అర్హులందరికీ ఆరు గ్యారంటీలు
- ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కొల్కులపల్లిలో రైతులకు స్ప్రింక్లర్ల పత్రాలను అందజేస్తున్న ఎంపీ మల్లు, ఎమ్మెల్యే కసిరెడ్డి

మాడ్గుల: 'ప్రజా సంక్షేమమే.. ప్రజాపాలన లక్ష్యం. బీఆర్‌ఎస్ పార్టీలా అధికారం కోసం కుటిల రాజకీయాలు చేయం. ప్రజల ఆకాంక్షల మేరకే నడుచుకుంటాం' అని ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం సుద్దపల్లిలో బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. బ్రహ్మణపల్లిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆ తరువాత కొల్కులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్, లైబ్రరీ, సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు.. ఇరువురు ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఇదే వేదికగా అర్హులైన పలువురు రైతులకు స్ప్రింక్లర్ల పత్రాలను అందజేసి మాట్లాడారు.

బీఆర్‌ఎస్ హంగామా..

రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఏర్పడిన కేసీఆర్ ప్రభుత్వం.. సర్కార్ వైఫల్యాలను ప్రశ్నించే ఉద్యమకారుల గొంతు నొక్కడంతో పాటు, ధర్నాచౌక్‌ను ఎత్తి వేసిన ఘనత ఆయనకే దక్కిందని ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి విమర్శించారు. పదేళ్ల పాటు తెలంగాణను పరిపాలించిన ఆయన.. ప్రజా సమస్యలను విస్మరించి, హంగు ఆర్భాటాలతో దేశ రాజకీయాలు అంటూ హంగమా చేశారని ఎద్దేవా చేశారు. ప్రగతిభవన్, సెక్రటేరియట్ సౌదాలు నిర్మించి, ఇదే అభివృద్ధి అని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. వెరసి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తున్నామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర సభ్యుడు రాంరెడి, అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు మర్కెట్ చైర్మన్ యాట గీత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అనురాధ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, మిద్దెరాములు, దళపతి, రమేష్, బాబా, ఏంతఊఓ సర్దార్ నాయక్, ఎంపీడీఓ పద్మావతి, ఏంఆర్‌ఓ వినోద్ సాగర్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

లయన్ జిల్లా గవర్నర్ కోటేశ్వర్‌రావు


అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన కోటేశ్వర్‌రావు

ఆమనగల్లు: సామాజిక సేవల్లో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అందరికీ ఆదర్శంగా నిలిచిందని లయన్ జిల్లా గవర్నర్ డాక్టర్ కోటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో లయన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి సహకారంతో ఆమనగల్లు క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని గవర్నర్ ప్రారంభించి మాట్లాడారు. ఒక గ్లాసు రాగి జావ మూడు గ్లాసుల పాలతో సమానమని, అనేక పోషకాలను అందిస్తుందని తెలిపారు. రోజువారి ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని పేర్కొన్నారు. క్లబ్ వీల్స్ ఆన్ మీల్స్ పేరిట నిరుపేదలకు అన్నదానం చేస్తూ ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. కార్యక్రమంలో లయన్ ఎల్‌సీఎఫ్ కో ఆర్డినేటర్ చెన్నకిషన్‌రెడ్డి, జోన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ శ్రీను, ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ, పీఆర్‌ఓ పాష, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, డైరెక్టర్ వెంకటేశ్, లయన్స్‌సభ్యులు రమేశ్, సునంద, గంప శ్రీను, వెంకటేశ్, సత్యం, వేణుగోపాల్, జహంగీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రవిదాస్ మార్గం అనుసరణీయం


రవిదాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: జగద్గురు సంతు శిరోమణి గురు రవిదాస్ మార్గం అనుసరణీయమని సంతు గురు రవిదాస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాజు అన్నారు. రవిదాస్ మహరాజ్ ధర్మస్థల్ ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో రవిదాస్ 648వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. రవిదాస్ చమర్ కులంలో జన్మించినప్పటికీ, మన చేతల్లోనే భగవంతుడు ఉన్నాడనే సందేశం ద్వారా జాతి వర్ణ భేదాలను తిరస్కరించి, మానవత్వాన్ని ఎత్తిచూపారని గుర్తు చేశారు. స్త్రీ విద్యా, దళితుల గౌరవం కోసం పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ ఎస్.దామోదర్, బీజేపీ క్రమశిక్షణ కమిటీ నాయకులు ప్రతాప్, విజయ్, బండిమీది కృష్ణ, కంబాలపల్లి భాస్కర్, యాదయ్య, విజయ్‌కుమార్, అంజయ్య, జోగు అంజయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

నేత్రపర్వంగా బ్రహ్మోత్సవాలు


లలితా పారాయణం చేస్తున్న మహిళలు

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం ఆలయ అర్చకులు తిరునగరి శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ప్రముఖ ఉపాసకురాలు జ్ఞాన ప్రసూనాంబ ఆధ్వర్యంలో మహిళలు విష్ణు సహస్ర నామం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. సామూహిక కుంకుమార్చన అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు సాయిరెడ్డి, రాములు, బ్రహ్మచారి, జంగారెడ్డి, అశోక్‌రెడ్డి, అమృతం, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శివభక్తులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి 16 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో ఉత్సవాల కరపత్రాలను శివ భక్తులతో కలిసి ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి కల్యాణం జరపనున్నట్లు తెలిపారు. శివ భక్తులు సాయిలు, శ్రీను, అశోక్, గోపాల్, వెంకట్, గోవర్ధన్, గణేశ్, అమర్, దేవరాజు, దుర్గాప్రసాద్, రాజు, వెంకటేశ్, శివ, మల్లేశ్, నరేశ్, శ్రీహరి ఉన్నారు.

14న 'విజయ తెలంగాణ' పుస్తకం ఆవిష్కరణ

తుక్కుగూడ: తెలంగాణ ఉద్యమ కారుడు, మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ తెలంగాణ సాధనలో ఆయన పాత్ర, చారిత్రక వాస్తవాలు, అనుభవాల ఆధారంగా రూపుదిద్దుకున్న 'విజయ తెలంగాణ' పుస్తకాన్ని శుక్రవారం నగరంలోని జలవిహార్‌లో ఆవిష్కరించనున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తదితరులు రానున్నారని పేర్కొన్నారు. దేవేందర్ గౌడ్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అవగాహనతో కుష్టు నిర్మూలన


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

హుడాకాంప్లెక్స్: సరైన అవగాహన ద్వారా కుష్టు వ్యాధిని నిర్మూలించవచ్చని పారామెడికల్ రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పురుషోత్తంరావు అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల సందర్భంగా బుధవారం లయోల పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సరూర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పురుషోత్తంరావు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు పక్షోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులకు, మహిళా మండలి, యువజన సంఘాల వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సద్గుణాచారి, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రఘు ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన నేతలు


కేసీఆర్‌తో బీఆర్‌ఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, ఆ పార్టీ ఇబ్రహీంపట్నం అధికార ప్రతినిధి కర్నె అరవింద్ బుధవారం ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీకి సంబంధించిన విషయాలను కేసీఆర్ అడిగి తెలుసుకున్నట్లు అరవింద్ తెలిపారు. పార్టీ పటిష్టతకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి సంఘటితంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కేసీఆర్ ఆదేశించినట్లు వెల్లడించారు.

'ఈజీఎస్'ను వినియోగించుకోండి


ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

ఆమనగల్లు: ఈజీఎస్ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023–24 సంవత్సరానికి ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఈజీఎస్ పనుల సామాజిక తనిఖీలు నిర్వహించామని, ఏడాదిలో రూ.1.88 కోట్ల విలువైన 295 పనులు మండల పరిధి 13 గ్రామాల్లో చేపట్టామని వెల్లడించారు. ఈజీఎస్ పనుల్లో అవినీతి అక్రమాలకు చోటు ఇవ్వరాదని సూచించారు. ప్రజలు సూచించిన పనులను చేపడతామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏపీడీ నరేందర్‌రెడ్డి, డీవీఓ కొండయ్య, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ సునీత, ఎస్‌ఆర్‌పీ సురేశ్, ఎంపీడీఓ కుసుమ మాధురి, ఏపీఓ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటన

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గంలో గురువారం పర్యటించనున్నారని క్యాంపు కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నంలో ఉదయం 12 గంటలకు మాస్టర్ మైండ్స్ స్కూల్ ప్రారంభోత్సవం, అనంతరం వరుసగా మంచాల మండలం పీసీతండాలో హనుమాన్ దేవాలయం, ఆరుట్లలో వేణుగోపాలస్వామి ఆలయం సందర్శన, మంచాల మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్ తనిఖీ, ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మధ్యాహ్నం 2 గంటలకు సమీక్ష నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

రాజరాజేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన నేడు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లి గ్రామంలో గురువారం తెల్లవారు జామున రాజరాజేశ్వరి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచే కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక పూజలు జరుగుతున్నాయని, విగ్రహ ప్రతిష్ఠాపనకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గూడు దక్కింది.. గోడు మిగిలింది

పేదల గూడు జేఎన్ఎన్‌యూఆర్‌ఎంలో సమస్యలు తిష్టవేశాయి. సౌకర్యాల లేమితో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. కనీస నీటి సౌకర్యం సరిగా లేక అవస్థలు పడుతున్నారు. బోరు బావులు ఉన్నప్పటికీ.. తగిన ఏర్పాట్లు చేయడంలో కార్పొరేషన్ అధికారులు విఫలమయ్యారు.

జేఎన్ఎన్‌యూఆర్‌ఎంలో సమస్యల తిష్ట

- సౌకర్యాల లేమితో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటులో జాప్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


జేఎన్ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల సముదాయం

బడంగ్‌పేట్: దివంగత నేత, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మానసపుత్రిక జేఎన్ఎన్‌యూఆర్‌ఎం నివాసగృహాలు. నాడు కాంగ్రెస్ పార్టీ పేదల కోసం వీటిని నిర్మించింది. అర్హులకు కేటాయించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. అక్కడ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గూడు అయితే ఇచ్చారు కానీ.. వసతులు లేక కొట్టుమిట్టాడుతున్నామని, మా గోడు వినేవారు లేరని లబ్ధిదారులు వాపోతున్నారు.

225 బ్లాకులు.. 16 పోర్షన్లు

బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జేఎన్ఎన్‌యూఆర్‌ఎం పేరుతో పేదల కోసం ఇళ్లను నిర్మించారు. ప్రస్తుతం జీ+త్రీలో నాలుగు ఫేస్‌లుగా విభజించారు. 225 బ్లాకులతో 16 పోర్షన్లుగా ఒక్కో పోర్షన్‌కు 224 డబుల్ బెడ్రూం ఇళ్లను, మొత్తంగా 16 వందల డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. నిరుపేదలకు కేటాయించారు. 40 గజాల్లో రెండు బెడ్రూంలు, రెండు కిచెన్‌లు రెండు బాత్రూంలు నిర్మించారు. గృహసముదాయాకి అయిన సామగ్రి ఖర్చును మాత్రమే లబ్ధిదారుని వద్ద తీసుకుని, రెండు పడక గదులను కేటాయించారు.

కేటాయింపులు సరే.. వసతులేవి?

నాటి ప్రభుత్వాలు నిరుపేదలకు ఇళ్లు కేటాయించి చేతులు దులుపుకొన్నాయి. వసతుల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు అంతస్తులు నిర్మించినప్పటికీ.. ఆ పైకి నీటి సరఫరాను మరిచారు. దీంతో చేసేది లేక లబ్ధిదారులు కింద నుంచి నాలుగో అంతస్తుకు నిత్యం బిందెలతో నీరు మోస్తున్నారు. ఒక్క పై అంతస్తుల్లోనే కాదు.. కింద వారికి ఇవే సమస్యలు. అదే ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో పార్కుల అభివృద్ధి జరగలేదు. అంగన్ వాడీ కేంద్రం మంజూరు చేయలేదు. ఇక్కడ జనాభా పెరుగుతున్నప్పటికీ.. పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. ఏడాది క్రితం ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. అందుకు అవసరమైన వసతులు మరిచారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, భవన సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బోర్లు ఉన్నాయి..



జేఎన్ఎన్‌యూఆర్‌ఎంలో నివాసం ఉంటున్న పేదలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నాయి. సౌకర్యాలు మరిచింది. తొలుత కావలసిన మౌలిక వసతులు కల్పించాలి. బోర్లు ఉన్నాయి. వాటి ద్వారా నాలుగు అంతస్తుల పైకి నీరు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి.

– పురుషోత్తం, ఎంసీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు

సమస్యలు పరిష్కరిస్తాం



కుర్మల్‌గూడ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మా దృష్టికి వచ్చాయి. త్వరలో పరిష్కరిస్తాం. అక్కడ 20కి పైగా బోర్లు ఉన్నాయి. నాలుగు అంతస్తుల పైకి నీరు చేరడం లేదని ప్రజలు విన్నవించారు. పరిశీలించి పరిష్కార మార్గం చూపుతాం.

– సరస్వతి, కమిషనర్

పుట్టి పెరిగిన ఊరిపై మమకారం

- గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు
- ఆదర్శంగా నిలుస్తున్న పెద్దమ్మ తండాకు చెందిన డాక్టర్ నితీశ్‌నాయక్


వలంటీర్‌గా రోగులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ నితీశ్‌నాయక్

మహేశ్వరం: కన్న ఊరితో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించి ఆదర్శంగా నిలుస్తున్నాడు మండల పరిధిలోని పెద్దమ్మతండాకు చెందిన నేనావత్ నీలమ్మ-విఠల్ నాయక్‌ల కుమారుడు నేనావత్ నితీశ్‌నాయక్. కష్టపడి చదివి నీట్‌లో ర్యాంకు పొంది బెంగుళూర్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. ఎంబీబీఎస్ డాక్టర్ కోర్సు పూర్తి చేసిన తాను పుట్టి పెరిగిన మండలం, గ్రామంలో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని గత ఐదునెలల క్రితం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో ఉన్న 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడిగా చేరి రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఆస్పత్రిలోనే కాకుండా తన సొంతూరు పెద్దమ్మతండాలో నివాసం వద్దకు ఆరోగ్య సమస్యలతో ఎవరైనా ప్రజలు వస్తే వారికి ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అమీర్ సిద్దీఖీ సహకారంతో ఆస్పత్రిలో విధులకు హాజరై రోగులకు సేవలు అందించారు. వలంటీర్ వైద్యుడిగా ఉచిత సేవలు అందిస్తూ పీజీ నీట్ పరీక్షలకు ప్రిపరేషన్ అయ్యాడు. ఇటీవల విడుదలైన పీజీ నీట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి తమిళనాడు చెన్నైలో పీజీ ఆర్థోపిట్ చదవడానికి వెళ్తున్నారు. పీజీ కోర్సు పూర్తయ్యాక తాను పుట్టి పెరిగిన తండా, మండలంలో పేదలకు ఉచిత సేవలు అందిస్తానని డాక్టర్ నితీశ్‌నాయక్ తెలిపారు. చిన్నప్పుడు మా తండా, మండలంలో వైద్య సేవలు అందక ఎంతో మంది పేదలు, కుటుంబ సభ్యులు ఇబ్బంది పడ్డారని, వాటిని చూసిన తనకు ఎలాగైనా కష్టపడి చదివి డాక్టర్‌గా పుట్టి పెరిగిన ప్రాంతాల్లో ఉచితంగా వైద్య సేవలు అందించాలని నిర్ణయించుకున్నాని తెలిపారు. భవిష్యత్‌లో పేదలకు, తాను పుట్టి పెరిగిన మహేశ్వరం మండల ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందిస్తానని నితీశ్ స్పష్టంచేశారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ సత్య హాస్పిటల్ ఆవరణలో ఈ నెల 14న హైదరాబాద్ మెడిసిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ బికుమాండ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేస్తామని తెలిపారు. అన్ని రకాల రక్త పరీక్షలను నామమాత్రపు ఫీజుతో చేస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.